



అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త


తెలుగు దిన పత్రిక..




సంపుటి - 3 సంచిక -59 శనివారం 1ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# టేకాఫ్‌కు రెడీ..



## నేడు భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న ప్రధాని మోదీ

మోదీ జీ మీ కోసం ఎదురుచూస్తున్నాం: సీఎం చంద్రబాబు

భారీ భద్రత.. 7,000 మంది పోలీసుల మోహరింపు

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖద్వారంగా ఈ విమానాశ్రయం

హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్




**భోగాపురం, జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**

"ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధమైంది... మోదీ జీ, మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం" అంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నానికి ఇప్పుడు రెక్కలొచ్చాయని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంత అభివృద్ధికి ముఖద్వారంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ పర్యటనపై ఫేస్ బుక్ వేదికగా చంద్రబాబు ఈ విధంగా స్పందించారు.విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ (ఆగస్టు 1) లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఉత్తరాంధ్రకు మౌలిక వసతుల కల్పనలో ఇదొక కీలక ముందడుగు అని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.ప్రధాని పర్యటన సందర్భంగా విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సుమారు 7,000 మంది పోలీసు సిబ్బందిని భద్రతా విధుల్లో మోహరించారు. ప్రారంభోత్సవానికి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణ, ఇతర సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్రకు పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షితమవుతాయని కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.




## కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులు

ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్లు

పిఎం కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు

కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్

## విద్య, పెట్టుబడులే ప్రధాన అజెండా

ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా సహాయ మంత్రి జూలియన్ హిల్

గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికిన మంత్రులు లోకేశ్, టీజీ భరత్




## ఉద్యమ శిఖరం ఇకలేరు



బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది కన్నుమూత

చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి -అభిమాన నాయకుడు మరణంతో విషాదం

**వరంగల్, జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ఉద్యమ కెరటం, కేసీఆర్ ప్రధాన అనుచరుడు, నర్సంపేట రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రైతు బాంధవుడు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధనలో తనదైన ముద్ర వేసి అందరి మన్ననలు పొందిన ఉద్యమ నేత, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు. ఈ వార్తను నర్సంపేట ప్రజలే కాదు,మిగతా 2లో...




## కారుణ్య నియామకాలకు పెళ్లైన కుమార్తెలు అర్హులే

వివాహితులైన కుమార్తెలకు ఉద్యోగ హక్కు: కారుణ్య నియామకంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

విడాకులు తీసుకున్న వారికే అర్హత అనే నిబంధన రాజ్యాంగ విరుద్ధమని తీర్పు

కుమారులు, కుమార్తెల మధ్య వివక్ష చూపరాదని తేల్చిచెప్పిన ధర్మాసనం

పిటిషనర్ అభ్యర్థనను 8 వారాల్లోగా పరిశీలించాలని బీహార్ ప్రభుత్వానికి ఆదేశం




## విదేశీ ఉద్యోగార్థుల బాధ్యత టామ్‌కాందే

పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు అన్నీ చూసుకోవాలి

స్కిల్ యూనివర్సిటీల్లో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ఏటీసీల్లో అప్‌గ్రేడ్ సిలబస్‌తో ఆధునిక కోర్సులకు ప్రాధాన్యం

అవసరమైన చోట్ల నర్సింగ్ కళాశాలల ఏర్పాటు

'శక్తి' శాఖ సమీక్షలో సీఎం ఏ రేవంత్ రెడ్డి


**హైదరాబాద్, జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**
వస్తే వీసా గడువు పొడిగింపు కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ మార్పుతో పరిశోధన ఆధారిత, ఎక్కువ కాలం కొనసాగే డిగ్రీలు చదివే విద్యార్థులకు అనిశ్చితి ఏర్పడుతుందని నిపుణులు చెప్తున్నారు. అలాగే పట్టభద్రులైన తర్వాత కొంతకాలం అమెరికాలో ఉద్యోగ అనుభవం పొందే అవకాశాలు కూడా పరిమితమయ్యే ప్రమాదం ఉంది.విదేశీ విద్యార్థుల వాటా ఐదు శాతం అమెరికాలో



## తెలంగాణలో మరోమారు సర్ గడువు పొడిగింపు

మరో వారం రోజులు పొడిస్తూ ఇసి ఆదేశాలు

ఆగస్ట్ 10 వరకు పొడగించినట్లు వెల్లడి



**హైదరాబాద్, జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**
కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని మరోమారు పొడిగించింది. ఆగస్టు 10 వ తేదీ వరకు ఓటర్లు తమ వివరాలను బీఎల్‌వో లకు అందజేయాలని స్పష్టం చేసింది. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 17న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని సెప్టెంబర్మిగతా 2లో...

## ప్రపంచ స్థాయి పెట్టుబడి కేంద్రంగా హైదరాబాద్

దేశ జీడీపీలో తెలంగాణ వాటాను పదిశాతం పెంచడమే లక్ష్యం

పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన ప్రదేశం

సిఐఐ ప్రతినిధుల భేటీలో సీఎం రేవంత్ రెడ్డి



## తెలంగాణలో మరోమారు సర్ గడువు పొడిగింపు

**మొదటిపేజీ తరువాయి**

16వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని వివరించింది. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు క్లెయిములను అభ్యంతరాలను పరిష్కరిస్తామని , అక్టోబర్19న ఫైనల్ పబ్లికేషన్‌ను విడుదల చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును మరోసారి పొడిగించారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించే గడువును ఆగస్టు 10 వరకు పొడిగించారు. ఆగస్టు 3న ముగియాల్సిన గడువును 10వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. తొలుత

ఈ గడువు జులై 24 వరకే ఉండగా ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా ఆ తేదీని ఆగస్టు 10కి మార్పు చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తయిందని ఈసీఐ తెలిపింది. హైదరాబాద్ జిల్లాలో 56.31 శాతం, రంగారెడ్డిలో 63.43, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61.37 శాతం పూర్తయినట్లు పేర్కొంది. ఇదిలావుంటే కేంద్ర ఎన్నికల సంఘం సెక్రటరీ నవీన్ కుమార్ తెలంగాణలో పర్యటించారు. సర్ ప్రక్రియను సమీక్షించేందుకు ఆయన రాష్ట్రానికి వచ్చారు. అంతకుముందు ఆయనకు తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వాసం వెంకటేశ్వర రెడ్డి స్వాగతం పలికారు. నవీన్ కుమార్ సుదర్శన్‌రెడ్డితో రాష్ట్రంలో జరుగుతున్న 'సర్' ప్రక్రియ పురోగతిపై చర్చించారు. అనంతరం జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎలక్షన్ ఆఫీసుకు వెళ్లి అధికారులతో మాట్లాడారు.

## విద్య, పెట్టుబడులేప్రధాన అజెండా

### ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా సహాయ మంత్రి జూలియన్ హిల్

### గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికిన మంత్రులు లోకేశ్, టీజీ భరత్

**అమరావతి జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**

ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడింది. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, పౌరసత్వ వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్ శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటనకు విచ్చేశారు. గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఘన స్వాగతం లభించింది.రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కలిసి జూలియన్ హిల్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ పర్యటన వివరాలను మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఆస్ట్రేలియా మంత్రితో జరగనున్న చర్చలు ఫలవంతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అంతర్జాతీయ విద్య, నైపుణ్యాలు, ఆవిష్కరణలు, పెట్టుబడుల వంటి కీలక రంగాల్లో ఇరుపక్షాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకోవడంపై ఈ పర్యటనలో ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు లోకేశ్ తెలిపారు. ఈ పర్యటన ద్వారా ఏపీ, ఆస్ట్రేలియా మధ్య సహకారం కొత్త పుంతలు తొక్కుతుందని అధికారులు భావిస్తున్నారు.

## కారుణ్య నియామకాలకు పెళ్లైన కుమార్తెలు అర్హులే

**ఢిల్లీ జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**

కారుణ్య నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. వివాహిత అనే కారణంతో కుమార్తెకు కారుణ్య నియామకాన్ని నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది. కేవలం విడాకులు తీసుకున్న లేదా భర్త నుంచి విడిపోయిన కుమార్తెలకు మాత్రమే ఈ అవకాశం కల్పించే ప్రభుత్వ నిబంధనలు చెల్లవని తేల్చిచెప్పింది. ఇటువంటి వర్గీకరణ రాజ్యాంగంలోని అధికరణ 14 ప్రకారం కల్పించిన సమానత్వ హక్కుకు పూర్తి విరుద్ధమని న్యాయస్థానం పేర్కొంది.బీహార్ ప్రభుత్వానికి చెందిన 2014 నాటి విధానాన్ని సవాలు చేస్తూ సయారా ఖాతూన్, ఆమె కుమార్తె దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తండ్రి మరణానంతరం ఉద్యోగం కోసం కుమార్తె చేసుకున్న దరఖాస్తును తొలుత బీహార్ ప్రభుత్వం, అనంతరం పాట్నా హైకోర్టు తిరస్కరించడంతో బాధిత కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "కుమారులు, కుమార్తెల మధ్య ఎలాంటి వివక్ష చూపినా అది రాజ్యాంగబద్ధం కాదు. వివాహం తర్వాత కుమార్తెకు పుట్టింటితో బంధం తెగిపోతుందని, ఆమె కేవలం భర్తపైనే ఆధారపడి జీవిస్తుందని భావించడం తగదు" అని అభిప్రాయపడింది. కేవలం సాంకేతిక కారణాలను సాకుగా చూపి దరఖాస్తులను తిరస్కరించడం సరికాదని స్పష్టం చేసింది. మృతుడి సోదరుడు తొలుత అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, అనంతరం నిరభ్యంతర పత్రం సమర్పించిన విషయాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది.పాట్నా హైకోర్టు ఉత్తర్వులను, బీహార్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసిన సుప్రీంకోర్టు పిటిషనర్ అభ్యర్థనను ఎనిమిది వారాల్లోగా మెరిట్ ప్రాతిపదికన పునఃపరిశీలించాలని అధికారులను ఆదేశించింది. కారుణ్య నియామకాలకు కుటుంబ ఆర్థిక స్థితిగతులు, అవసరాలే ప్రామాణికం కావాలని, వివాహ స్థితి కాదని ఈ తీర్పు ద్వారా సర్వోన్నత న్యాయస్థానం పునరుద్ఘాటించింది.

## కొత్తగా రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులు

**న్యూఢిల్లీ జూలై 31 (జర్నలిస్ట్ వార్త):** :ఓంద్ర కేబినెట్ నేడు రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. మొత్తం 4,50,988 కోట్ల రూపాయల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ఇప్పటికే తలసరి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మొదటి స్థానంలో ఉందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద డ్యామ్‌లు, సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 5000 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశిరచుకున్నామని అన్నారు. రాబోయే ఐదేళ్లల్లో ఎ÷-లోటింగ్ సోలార్ ప్యానెల్ విద్యుత్ ఉత్పత్తిని 7 రెట్లు పెంచుతామని చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు కేటాయించి నట్టు మంత్రి తెలిపారు. 2026-2030 మధ్య కాలానికి ఈ మొత్తాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక సముద్ర మంథన్ పథకానికి 84,084 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. 2030-31 వరకూ ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. సముద్రం అడుగున దాగున్న ముడిచమురు, సహజవాయువు వనరుల గుర్తింపు కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఖేలో ఇండియా పథకానికి సంబంధించి కేంద్రం రాబోయే ఐదేళ్ల కాలానికి రూ.29,054 కోట్లు కేటాయించిందని కూడా మంత్రి తెలిపారు. యూనీ డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నుల్స్ నిర్మాణానికి 9,779 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు.

## సారమ్మ ప్రథమ వర్ధంతికి ఘన నివాళి



**వరంగల్/జూలై 31 (జర్నలిస్ట్ వార్త):** కాశిబుగ్గ కోటిలింగాల రోడ్డుకు చెందిన పల్లకొండ శ్రీను, రవి, చిన్నల తల్లి స్వర్గీయ శ్రీమతి పల్లకొండ సారమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాయపురం సాంబయ్య పాల్గొని సారమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారమ్మ కుటుంబానికి చేసిన సేవలు, ఆమె విలువలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, సారమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు, కాలనీవాసులు పాల్గొని సారమ్మకు నివాళులర్పించారు. ఆమె సేవలను, వ్యక్తిత్వాన్ని స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# టేకాఫ్‌కు రెడీ ..

**భోగాపురర, జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర భవిష్యత్తు, ముఖచిత్రం పూర్తిగా మారిపోనుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అల్లూరి సీతారామరాజు భోగాపురం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, ఉపాధి, రవాణా, పర్యాటకం, సాంస్కృతిక అభివృద్ధికి దోహదపడే అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మూడు లక్షలకు పైగా ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

## మహిళల అద్భుతం..

### థింసా నృత్యంతో గిన్నిస్ బుక్ రికార్డు





ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో గిరిజన విద్యార్థినులు, మహిళలు చారిత్రాత్మక ఘనత సాధించారు. సుమారు 13,000 మంది ఏకకాలంలో సంప్రదాయ థింసా నృత్యం చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డును నెలకొల్పారు. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణం ఈ అద్భుత ప్రదర్శనకు వేదికగా నిలిచింది. రేపు ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయనకు 13 వేల మందితో థింసా నృత్యం ప్రదర్శించడం ద్వారా స్వాగతం పలకనున్నారు. అందుకు సన్నాహకంగా ఇవాళ థింసా నృత్య ప్రదర్శన రిహార్సల్ చేపట్టారు.

మన్యం ప్రాంత గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ సంకీర్ణ ప్రభుత్వం ఈ భారీ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో వివిధ ఐటీడీఏ పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థినులు, మహిళలు పాల్గొన్నారు. వారంతా సంప్రదాయబద్ధంగా గులాబీ రంగు, ఆకుపచ్చ అంచు చీరలను ధరించి, ఎంతో లయబద్ధంగా థింసా నృత్యం చేసి ఆకట్టుకున్నారు.

ఈ మహా ప్రదర్శనను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారులు అక్కడే ఉండి పర్యవేక్షించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ప్రదర్శన జరిగిందని నిర్ధారించుకున్న తర్వాత, దీనిని అధికారికంగా ప్రపంచ రికార్డుగా ప్రకటించారు. ప్రభుత్వ పక్షాన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి కూడా గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రోజుల తరబడి కఠోర సాధన చేసి ఈ రికార్డును సాధించిన మహిళలు, వారికి శిక్షణ ఇచ్చిన సిబ్బంది, అధికారులను మంత్రి అభినందించారు. గిరిజన కళారూపాలను ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లేందుకు చేసిన ఈ ప్రయత్నాన్ని ఆమె ప్రశంసించారు.

# ఉద్యమ శిఖరం ఇకలేరు

**మొదటిపేజీ తరువాయి**

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నెల 26న తీవ్రమైన గుండెపోటు రావడంతో వెంటనే హనుమకొండలోని రోహిణి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, మరో మాజీ మంత్రి హరీశ్ రావు దగ్గరుండి హైదరాబాద్‌కు తరలించారు. గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఉదయం 12 గంటల 51 నిమిషాలకు కన్నుమూశారు. తమ అభిమాన నాయకుడు, ఉద్యమ సారథి పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరనే విషయాన్ని నర్సంపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు నమ్మలేకపోతున్నారు. పెద్ది అకాల మరణం వరంగల్ జిల్లాలో విషాదాన్ని నింపింది. ఆయన మృతికి ఉమ్మడి వరంగల్‌తో పాటు యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా తమ నివాళులు అర్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం నుంచి జడ్పీటీసీగా గెలుపొందిన పెద్ది సుదర్శన్ రెడ్డి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ నేత కేసీఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన నాయకుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ది సుదర్శన్ రెడ్డి మొదటి వరుసలో నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ సాధన కోసం ప్రపంచ స్థాయిలో రికార్డు సృష్టించిన భారీ బహిరంగ సభను వరంగల్‌లోని ప్రకాశ్‌రెడ్డిపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రధాన సభల బాధ్యతలను ఉద్యమ నేత కేసీఆర్ పెద్ది సుదర్శన్ రెడ్డికే అప్పగించేవారు. ఏల్కతుర్తిలో జరిగిన టీఆర్ఎస్ భారీ సభ కూడా ఆయన నిర్వహణలోనే జరిగింది.అధికారంలో ఉన్నామా లేదా అనేది కాదు? ప్రజలకు ఏమి చేశామనేదే ముఖ్యం అనే భావనతో పనిచేసిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి. 2014లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి, పాకాల సరస్సును నింపి నర్సంపేట ప్రజల గుండెల్లో రైతు బాంధవుడిగా చిరస్మరణీయమైన ముద్ర వేశారు. మాదన్నపేట వాగుపై సిద్దాం నిర్మించి, నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా కృషి చేశారు. రైతు బాంధవుడిగా సుదర్శన్ రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనసులో చెరగని ముద్ర వేశారు.

## ఉద్యమ సహచరుడి మరణం తీరని లోటన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

### అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు

తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన 2001 నుంచి పెద్ది సుదర్శన్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు అత్యంత సన్నిహితుడిగా కొనసాగారు. ఆయన మృతిపై కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉద్యమ సహచరుడిని, ఆత్మీయుడిని కోల్పోవడం తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# విదేశీ ఉద్యోగార్థుల బాధ్యత టామ్‌కాందే

**మొదటిపేజీ తరువాయి**

విదేశీ విద్యార్థులకు విద్య అందించడం కూడా ఒక రకమైన సేవల ఎగుమతేనని పీటర్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్‌కు చెందిన సీనియర్ పరిశోధకుడు మైఖేల్ ఎ. క్లెమెన్స్ తన అధ్యయనంలో పేర్కొన్నారు. అమెరికా సేవల ఎగుమతుల్లో దాదాపు ఐదు శాతం వాటా విదేశీ విద్యార్థుల నుంచే వస్తుందని ఆయన వివరించారు. కొత్త నిబంధనల కారణంగా విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గితే సేవల ఎగుమతులు దెబ్బతిని, అమెరికా వాణిజ్య లోటు మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

**ఆవిష్కరణలు, ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం**

అంతకంటే పెద్ద సమస్య నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత అని ఆ అధ్యయనం పేర్కొంది. ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) రంగాల్లో విదేశీ విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని క్లెమెన్స్ పేర్కొన్నారు. అమెరికాలో చదివి అక్కడే ఉద్యోగాల్లో చేరే విదేశీ విద్యార్థులు సాధారణ గ్రాడ్యుయేట్లతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువగా కొత్త పేటెంట్లు నమోదు చేస్తున్నారని తెలిపారు. అమెరికాలో నమోదయ్యే మొత్తం పేటెంట్లలో దాదాపు 10 శాతం వరకు విదేశీ విద్యార్థులే కారణమవుతున్నారని ఆ పరిశోధన పేర్కొంది. అలాగే అమెరికాలో జన్మించిన గ్రాడ్యుయేట్లతో పోలిస్తే ఆరు రెట్లు ఎక్కువగా స్టార్టప్ కంపెనీలను స్థాపిస్తున్నారని వెల్లడించింది. ఇటువంటి ప్రతిభావంతులైన విద్యార్థులు తగ్గిపోతే అమెరికాలో ఆవిష్కరణలు, పరిశ్రమల అభివృద్ధి, ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం పడుతుందని అధ్యయనం హెచ్చరించింది.

**భారీ మూల్యం తప్పదు**

ఈ నష్టం విద్యా రంగానికే పరిమితం కాదని పరిశోధకులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో రూపుదిద్దుకోలేని కొత్త ఉత్పత్తులు, అభివృద్ధి చెందని తయారీ సాంకేతికతలు, ప్రారంభం కాని స్టార్టప్ సంస్థలు, నమోదు కాని పేటెంట్లు, దేశంలో పుట్టుకు రాని కొత్త పరిశ్రమల రూపంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక మూల్యం చెల్లించాల్సి వస్తుందని అధ్యయనం హెచ్చరించింది. దీంతో విదేశీ విద్యార్థులపై కఠిన ఆంక్షలు చివరికి అమెరికానే దెబ్బతీసే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రపంచ స్థాయి పెట్టుబడి కేంద్రంగా హైదరాబాద్

**హైదరాబాద్, జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. టోక్యో, న్యూయార్క్‌తో పోటీ పడే తెలంగాణ తమ లక్ష్యమని పేర్కొన్నారు. శుక్రవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సీఐఐ నార్తర్న్ రీజినల్ కౌన్సిల్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు రామకృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. పెట్టుబడులకు అత్యంత సురక్షిత రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. రండి... తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి అని పిలుపునిచ్చారు. 2047 నాటికి తెలంగాణ రైజింగ్ చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని వ్యాఖ్యానించారు.

దేశ జీడీపీలో తెలంగాణ వాటాను పదిశాతానికి పెంచడమే తమ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. 2037 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మారుస్తామని చెప్పుకొచ్చారు. పాలసీ పెరాలసిస్ తెలంగాణలో లేదని అభిప్రాయపడ్డారు. మంచి విధానాలు ఏ పార్టీవైనా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. క్యూర్,ప్యూర్, రేర్ మోడల్‌తో తెలంగాణను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డును పారిశ్రామికంగా విస్తరణ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భారత్ ఫ్యూచర్ సిటీ మచిలీపట్నం 12 లేన్ల రహదారిగా విస్తరిస్తున్నట్లు వివరించారు. తయారీ, సేవలు, వ్యవసాయ రంగాల్లో భారీ పెట్టుబడులకు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణకు మూడు బు÷-లలెట్ రైళ్లు రానున్నాయని సీఎం వివరించారు. ఏఐ సునామీకి తగ్గట్లుగా స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ఉద్యోగ నైపుణ్యాలను పెంచుతున్నామని చెప్పుకొచ్చారు. ఏటీసీల్లో చదివిన వారికి వందశాతం ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అమెజాన్, అదానీ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయని వెల్లడించారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రపంచ టాప్-500 కంపెనీలను తెలంగాణకు తీసుకురావడమే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. 'థింక్ గ్లోబల్ ..ఇన్వెస్ట్ లోకల్ అంటూ పెట్టుబడిదారులకు సీఎం పిలుపునిచ్చారు. తెలంగాణ అంటే వ్యాపారమని... ఇప్పుడు రైజింగ్ తెలంగాణ అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# నలభై ఏళ్ల విద్యాసేవకు ఘన వీడ్కోలు

## వైభవంగా వెంకటేశ్వర్‌రెడ్డి పదవీ విరమణ సన్మానం





**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజూలై 31 (జర్నలిస్ట్ వార్త):** నాలుగు దశాబ్దాలపాటు విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ ఆదర్శ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందిన తాటికాయల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొడ్డిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం గ్రామంలో ఘన సన్మాన సభ నిర్వహించారు. పలు మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై పూలదండలు, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తిని ఉద్యోగంగా కాకుండా సమాజ నిర్మాణ బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేసిన వ్యక్తి వెంకటేశ్వర్‌రెడ్డి అని కొనియాడారు. క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో వేలాది మంది విద్యార్థులకు మార్గదర్శిగా నిలిచారని అన్నారు. పదవీ విరమణ ఉద్యోగానికే పరిమితమని, సమాజ సేవలో ఆయన పాత్ర కొనసాగాలని ఆకాంక్షించారు. మాజీ ఎంఈఓ రాంధాన్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిని తన సొంత బిడ్డలా భావించి విద్యాబోధన చేసిన అరుదైన గురువుగా వెంకటేశ్వర్‌రెడ్డి నిలిచారని పేర్కొన్నారు. ఆయన సేవలు విద్యాశాఖలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, యువ ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్పంచ్ ననుబాల సోమక్క చంద్రమౌళి మాట్లాడుతూ, తాటికాయల పాఠశాల అభివృద్ధిలో వెంకటేశ్వర్‌రెడ్డి చేసిన కృషి ఎనలేనిదని, గ్రామానికి ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మాజీ సర్పంచ్ పెసరు రమేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలతో మమేకమై విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయుడిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని పేర్కొన్నారు. అనంతరం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, తన సేవా కాలంలో సహకరించిన విద్యాశాఖ అధికారులు, సహచర ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ప్రేమాభిమానాలే తనకు లభించిన గొప్ప పురస్కారమని అన్నారు. అదే రోజు ఆయన షష్టిపూర్తి వేడుకను కూడా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓ రాంధాన్, ఉపసర్పంచ్ పెసరు శివకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా మేరీ, ప్రధానోపాధ్యాయుడు రాజు, పీఆర్టీయూ నాయకులు, వివిధ మండలాల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చిన్నారులకు అక్షింతలు.. దుండేటి వీరారెడ్డి ఆశీర్వాదం



**తల్లాడ/ జూలై 31 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలోని వెంకటాపురం గ్రామంలో బిక్కు జాన్ మనవడు జావేద్, మనవరాలు హసీనా అన్నప్రాశన వేడుక శుక్రవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించారు. ఈ వేడుకకు వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, తల్లాడ మాజీ సర్పంచ్ వేమిరెడ్డి కృష్ణారెడ్డి హాజరై చిన్నారులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతోసుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రావుల గోపి గౌడ్, తవిడిశెట్టి యుగంధర్, రవి, షేక్ సిలార్, షరీఫ్, బిక్కు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ యూనివర్సిటీలో మైనర్ విద్యార్థి మిస్సింగ్

## హాస్టల్ నుంచి అదృశ్యం.. కేసు నమోదు



**హసన్‌పర్తి/జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**
హసన్‌పర్తి మండలంలోని ఎస్ఆర్ యూనివర్సిటీలో చదువుతున్న బీహార్‌కు చెందిన 16 ఏళ్ల మైనర్ విద్యార్థి మహ్మద్ ఎక్రమ్ హుస్సేన్ కనిపించకుండా పోవడంతో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. సమస్తిపూర్ జిల్లా (బీహార్)కు చెందిన మహ్మద్ ఎక్రమ్ హుస్సేన్ జూలై 28న యూనివర్సిటీ హాస్టల్‌లోని గది నంబర్–241లో చేరాడు. అయితే జూలై 29 నుంచి అతని సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. హాస్టల్ వార్డెన్‌ను సంప్రదించగా విద్యార్థి గదిలో లేడని తెలిసింది. దీంతో విద్యార్థి బావ సాద్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థి ఎత్తు సుమారు 5 అడుగుల 8 అంగుళాలు, తెల్లని ఛాయ, సన్నని శరీరాకృతి కలిగి ఉంటాడని పోలీసులు తెలిపారు. అతడి ఆచూకీ తెలిసిన వారు వెంటనే హసన్‌పర్తి పోలీసులను సంప్రదించాలని కోరారు. **సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:**
**ఇన్‌స్పెక్టర్: 8712685124ఎస్‌హెచ్‌ఓ: 8712685015ఎస్సైలు: 8712685097, 8712685098**

# భూ రీ సర్వేతో శాశ్వత భూ హక్కులు

## - రైతులందరూ సర్వేకు సహకరించాలి తహసీల్దార్ బావ్‌సింగ్





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 31 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ధర్మసాగర్ తహసీల్దార్ బావ్‌సింగ్ అన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ పుట్ట రేణుక అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు భూ రికార్డులను ఆధునికీకరించడం, ప్రతి భూయజమానికి స్పష్టమైన హద్దులు నిర్ధారించడం, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే రీ సర్వే ప్రధాన ఉద్దేశమని తహసీల్దార్ తెలిపారు. గ్రామంలో సర్వే బృందాలు వచ్చినప్పుడు రైతులు తప్పనిసరిగా హాజరై తమ భూములను చూపించాలని సూచించారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్, సంబంధిత భూ పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా అక్కడికక్కడే అధికారులను సంప్రదించాలని చెప్పారు. భూ రికార్డుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే సర్వే సమయంలోనే సరిదిద్దుకునే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. రైతులు అధికారులకు పూర్తి సహకారం అందిస్తే గ్రామంలో రీ సర్వే వేగంగా పూర్తవుతుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ పుట్ట రేణుక మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. గ్రామంలోని ప్రతి భూయజమాని రీ సర్వేలో పాల్గొని తమ భూముల హద్దులను ఖరారు చేసుకోవాలని కోరారు. అధికారులు కోరిన సమాచారం, పత్రాలను సకాలంలో అందించి గ్రామంలో రీ సర్వే విజయవంతం చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ గ్రామసభలో ఆర్ఐ అశోక్ రెడ్డి రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# తాటికాయల గ్రామంలోని బూరు కుంట హేనేమట్టి మాయం..!

## ప్రభుత్వ భూమిపై మట్టి మాఫియా కన్ను..?- రేపటి సంచికలో



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 31 (జర్నలిస్ట్ వార్త)** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామంలోని బూరు కుంట హేనే ప్రభుత్వ భూమి నుంచి రాత్రికి రాత్రే వందల ట్రాక్టర్ల మట్టిని అక్రమంగా తరలించారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. మట్టికి పెరిగిన డిమాండ్‌ను ఆసరాగా చేసుకున్న మట్టి మాఫియా భారీ యంత్రాలతో ప్రభుత్వ భూమిని తవ్వి సుమారు 400 ట్రాక్టర్ల మట్టిని తరలించి లక్షల రూపాయలు వెనకేసుకుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో ఇంత భారీ స్థాయిలో మట్టి తరలింపు జరుగుతున్నా సంబంధిత శాఖలు ఎందుకు పట్టించుకోలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ అక్రమ దందా వెనుక ఎవరున్నారు..? అధికారుల నిర్లక్ష్యమా..? లేక మరెవరైనా అండదండలున్నాయా..? బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. బూరు కుంట హీనే ప్రభుత్వ భూమిలో మట్టి మాయం వెనుక అసలు కథ ఏమిటి..?

**పూర్తి వివరాలతో ప్రత్యేక కథనం... రేపటి సంచికలో.**

# ఉద్యమానికి అగ్రశిఖరం..

## నర్సంపేటకు తీరని లోటు



**తెలంగాణ స్వప్నాన్ని భుజాన మోసిన పెద్ది సుదర్శన్ రెడ్డి ఇక లేరు**

**కన్నీరుమున్నీరైన అభిమానులు..**

**వేలాదిగా అంతిమయాత్ర..**

**కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుల భరోసా**





**నర్సంపేట/హనుమకొండ బ్యూరో జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**
ఒక ఉద్యమం తన గొంతును కోల్పోయింది. ఒక నియోజకవర్గం తన నాయకుడిని కోల్పోయింది. తెలంగాణ ఉద్యమానికి అంకితమైన జీవితాన్ని గడిపి, నర్సంపేట అభివృద్ధిని తన ధ్యేయంగా మలుచుకున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం నర్సంపేటతో పాటు తెలంగాణ రాజకీయ వర్గాలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఆయన మరణవార్త తెలిసిన క్షణం నుంచి నియోజకవర్గమంతా శోకసంద్రంగా మారింది. గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, ఉద్యమ సహచరులు, అభిమానులు, కార్యకర్తలు కన్నీరుమున్నీరుగా ఆయనకు తుది వీడ్కోలు పలికారు.

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న రోజుల్లో పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు ఉద్యమానికి ప్రతీకగా నిలిచింది. ప్రత్యేక తెలంగాణ సాధన ఒక్కటే లక్ష్యంగా ప్రతి అడుగును ప్రజా ఉద్యమానికి అంకితం చేశారు. సభలు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రజల్లో రగిలించారు. పోలీసు కేసులు, అరెస్టులు, నిర్బంధాలు, రాజకీయ ఒత్తిళ్లు ఎదురైనా వెనుదిరగకుండా ఉద్యమ బాటలో సాగిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. రాజకీయాల్లోనూ ప్రజలే కేంద్రబిందువుగా ముందుకు సాగారు. నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి అనేక ప్రణాళికలు రూపొందించి, వాటి అమలుకు కృషి చేశారు. మెడికల్ కాలేజీ ఏర్పాటు, పాకాల ప్రాంతానికి సాగునీటి సౌకర్యం, రంగయ్య చెరువు రిజర్వాయర్ అభివృద్ధి, పోడు భూముల సమస్యల పరిష్కారం వంటి ప్రజా ప్రయోజన అంశాలపై నిరంతరం శ్రమించారు. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, మౌలిక వసతుల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించారని స్థానికులు గుర్తు చేసుకున్నారు.

ఆయనకు ప్రజలతో ఉన్న అనుబంధమే అతిపెద్ద బలం. కష్టంలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలవడం, సమస్యలను స్వయంగా తెలుసుకొని పరిష్కార మార్గాలు అన్వేషించడం ఆయన నాయకత్వంలోని ప్రత్యేకతగా పలువురు పేర్కొన్నారు. అందుకే ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పలుచోట్ల స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి ప్రజలు సంతాపం తెలిపారు. అంతిమయాత్రలో వేలాదిగా తరలివచ్చిన ప్రజలు పెద్ది అన్న అమర్ రహే జై తెలంగాణ నినాదాలతో భావోద్వేగ వాతావరణం సృష్టించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యమ సహచరులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భరోసా ఇచ్చారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రలో పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని ఉద్యమ సహచరులు అన్నారు. ఆయన భౌతికంగా దూరమైనా, ఉద్యమ స్ఫూర్తి, ప్రజాసేవ పట్ల అంకితభావం, నర్సంపేట అభివృద్ధికి చేసిన కృషి ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలుస్తాయని నివాళులర్పించారు. నర్సంపేట రాజకీయ, సామాజిక జీవితంలో ఏర్పడిన ఈ వెలితి తీరనిదేనని ప్రజలు కన్నీరుమున్నీరుగా గుర్తుచేసుకుంటున్నారు. అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు

# కృష్ణలో బాంబుల మోత..!

## మత్స్య సంపదకు తూట్లు

**వాడపల్లిఇరికిగూడెం మధ్య యథేచ్ఛగా పేలుళ్లు**

**చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల డిమాండ్**





**దామరచర్ల/జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**దామరచర్ల మండలంలోని కృష్ణానదిలో బాంబులతో చేపల వేట యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్న మత్స్య సంపదను కొందరు అక్రమంగా బాంబులు పేల్చి నాశనం చేస్తున్నారని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వాడపల్లి రైల్వే కృష్ణా బ్రిడ్జి నుంచి ఇరికిగూడెం వరకు నది పరివాహక ప్రాంతంలో తరచూ బాంబులు పేల్చి చేపలను వేటాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వలలతో చేపలు పట్టాల్సిన కొందరు జాలర్లే ఈ అక్రమ పద్ధతిని అనుసరిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.బాంబుల ప్రభావంతో చిన్నా, పెద్దా చేపలు వందల సంఖ్యలో మృతి చెంది నదిలో తేలుతూ కనిపిస్తున్నాయని స్థానికులు తెలిపారు. దీంతో మత్స్య సంపదతో పాటు నదిలోని జీవావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కృష్ణానదిలో బాంబులతో చేపల వేటను వెంటనే అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ, పోలీసు శాఖ అధికారులను తోటి మత్స్యకారులు కోరుతున్నారు. అక్రమ వేటపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మత్స్య సంపదను కాపాడాలని విజ్ఞప్తి చేశాద

# వర్షాల జోరుతో ఊపందుకున్న వరి నాట్లు

**ఆయిల్‌ఫామ్ సాగుపై పెరుగుతున్న రైతుల ఆసక్తి**





**ఎల్కతుర్తి/ జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలంలో వరి నాట్లు జోరందుకున్నాయి. ఆలస్యంగా ప్రారంభమైన నైరుతి రుతుపవనాలు ఇటీవల కురుస్తున్న వర్షాలతో పుంజుకోవడంతో రైతులు సాగు పనులను వేగవంతం చేశారు. కాలువల కింద ఉన్న భూముల్లో ఇప్పటికే వరి నాట్లు పూర్తికాగా, వర్షాధార ప్రాంతాల్లో రైతులు పొలాలను దుక్కి చేసి నాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాల పరిస్థితిని బట్టి సాగు విస్తీర్ణాన్ని నిర్ణయిస్తూ రైతులు ముందుకు సాగుతున్నారు.జూన్, జూలై నెలల్లో వర్షాభావం కారణంగా వరి సాగు ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం అనుకూల వాతావరణం నెలకొనడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. సన్నరకం, సాంబా మసూరి, ఆర్ఎన్ఆర్, బాస్మతి, జై శ్రీరామ్ వంటి వరి రకాలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. అయితే పంట కోత సమయంలో హార్వెస్టర్ యంత్రాల కొరత వల్ల ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వర్షాల అనిశ్చితి కారణంగా కొందరు రైతులు కంది, పెసర, సెనగ వంటి ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.ఇదిలా ఉండగా, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రోత్సాహక పథకాలతో ఆయిల్‌ఫామ్ సాగుపై కూడా రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. మొక్కలు, ఎరువులు, పురుగుమందులకు సబ్సిడీతో పాటు తొలి మూడేళ్లపాటు ప్రోత్సాహం, దిగుబడి వచ్చిన తర్వాత కొనుగోలు హామీ ఉండటంతో పలువురు రైతులు ఆయిల్‌ఫామ్ సాగు వైపు అడుగులు వేస్తున్నారు. వరి సాగుతో పాటు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌ఫామ్ భవిష్యత్తులో రైతులకు స్థిరమైన ఆదాయ వనరుగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఆయిల్ పామ్ కంపెనీలకు తుమ్మల వార్నింగ్

**అలసత్వం సహించం.. పనితీరు లేకుంటే తొలగింపే**

**85 వేల ఎకరాల లక్ష్యంలో 20 శాతమే పూర్తి.. కంపెనీలపై మంత్రి తీవ్ర అసంతృప్తి**



**ఖమ్మం/ జూలై 31 (జర్నలిస్ట్ వార్త):** ఆయిల్ పామ్ సాగు విస్తరణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కంపెనీలపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించేందుకు సిద్ధమైంది. లక్ష్య సాధనలో విఫలమవుతున్న సంస్థలకు ఇకపై ఎలాంటి ఉపశమనం ఉండదని, అవసరమైతే వాటి పరిధిలోని జిల్లాలను తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం తప్పదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. రైతులు ముందుకొస్తుంటే కంపెనీలు వెనుకబడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.

శుక్రవారం సచివాలయంలో ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఈ ఏడాది 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకు కేవలం 17,090 ఎకరాల్లో మాత్రమే సాగు నమోదైందని, ఇది లక్ష్యంలో 20 శాతం మాత్రమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తున్నా కంపెనీల్లో చిత్తశుద్ధి కనిపించడం లేదని మండిపడ్డారు.

పనితీరు సరిగా లేని కంపెనీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినా పరిస్థితిలో మార్పు రాలేదని మంత్రి వెల్లడించారు. లోహియా, ఆయిల్ ఫెడ్, తిరుమల, ప్రియూనిక్, రామ్ చరణ్, గోద్రెజ్, విశ్వతేజ్, కేన్ బయో, పతంజలి, మాట్రిక్స్, సువేన్ ఆగ్రో కంపెనీలకు పలుమార్లు హెచ్చరికలు ఇచ్చినా ఆశించిన పురోగతి కనిపించలేదన్నారు.

ఇప్పటికే కొన్ని కంపెనీల పరిధిలోని జిల్లాలను తొలగించి ఇతర సంస్థలకు అప్పగించిన విషయాన్ని గుర్తు చేసిన మంత్రి, ఇకపై లక్ష్యాలను చేరుకోలేని ఏ కంపెనీపైనా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థ అయిన ఆయిల్ ఫెడ్‌కు కూడా మినహాయింపు లేదని, పనితీరు మెరుగుపడకపోతే దాని పరిధిలోని జిల్లాలను కూడా ఇతర సంస్థలకు అప్పగిస్తామని హెచ్చరించారు.

ఆగస్టులో మొక్కల కొరత తలెత్తకుండా అవసరమైతే ఇతర కంపెనీల నుంచి మొక్కలు కొనుగోలు చేసి రైతులకు అందించాలని ఆదేశించారు. రైతు కోరిన వెంటనే మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో కంపెనీల సిబ్బంది రైతులకు సాంకేతిక సహాయం అందించాలని సూచించారు.

నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. యూనిట్లు త్వరగా అందుబాటులోకి వస్తే రైతుల రవాణా వ్యయం తగ్గడంతో పాటు పంటకు సకాలంలో ప్రాసెసింగ్ సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ విస్తరణలో అలసత్వం ప్రదర్శించే కంపెనీలపై ఇకపై ప్రభుత్వం రాజీపడబోదని మంత్రి తేల్చిచెప్పారు.

## యజ్ఞ యాగాదుల వల్ల ప్రజలు సుభిక్షంగా ఉంటారు

**టి.ఎస్. ఎ. వి. ఎమ్. ఎస్ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు రాజేశ్వర్ రావు**



**హసన్ పర్తి/జులై 30 ( జర్నలిస్ట్ వార్త)**హసన్ పర్తి యజ్ఞ యాగాదులు నిర్వహించడం వల్ల ప్రజలు సుఖ శాంతులతో సుభిక్షంగా ఉంటారని, పూజలు వ్రతాలు, జపాలు చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, మన ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు సనాతన ధర్మాన్ని భవిష్యత్ తరాలకు అందించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని, తెలంగాణ ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు చకిలం రాజేశ్వర్ రావు అన్నారు. హసన్ పర్తిలో వెలగందుల భీష్మనాథం అధ్యక్షతన జరిగిన ఆర్య వైశ్య సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ 2 వ తేది ఆదివారం హనుమకొండలోని టి. టి. డి కళ్యాణ మండపంలో జరిగే గాయత్రి జప మహాయజ్ఞాన్ని ఆర్య వైశ్య సోదరులు వారి బంధువులతో సహా పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు ఎన్ మాధవ శంకర్, మాజీ అధ్యక్షులు ఎ. శంకర్, ఎమ్ శ్యాం సుందర్, ఎ శ్రీనివాస్, జి వెంకటేశ్వర్లు, ఎస్ నటరాజ్, ఎ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# 32 ఏళ్ల సేవలకు ఘన వీడ్కోలు

## కిట్స్‌లో ముగ్గురు ఉద్యోగుల పదవీ విరమణ వేడుక





**హసన్‌పర్తి/ జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**
కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) వరంగల్‌లో ఈఈఈ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డా. వి. రామయ్య, ఎంఅండ్ హెచ్ విభాగం సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జి. మంజులతా దేవి, డ్రైవర్ వి. ప్రసాద్‌ల పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం సిల్వర్ జూబ్లీ సెమినార్ హాల్‌లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోకరెడ్డి మాట్లాడుతూ డా. వి. రామయ్య 32 ఏళ్లపాటు ఈఈఈ విభాగాధిపతి, డీన్ స్టూడెంట్ అఫైర్స్, ఐఐఐసీ ఇన్‌చార్జిగా వివిధ బాధ్యతలు నిర్వహించి సంస్థ అభివృద్ధికి విశేష సేవలందించారని కొనియాడారు. డా. జి. మంజులతా దేవి 14 ఏళ్లపాటు ఇంగ్లీష్ విభాగంలో అధ్యాపకురాలిగా, లిటరరీ క్లబ్ ఇన్‌చార్జిగా విద్యార్థుల్లో సాహిత్యాభిరుచిని పెంపొందించారని తెలిపారు. డ్రైవర్ వి. ప్రసాద్ 18 ఏళ్లపాటు క్రమశిక్షణ, అంకితభావంతో సేవలందించి అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. ముగ్గురి సేవలు సంస్థకు ఆదర్శప్రాయమని, వారి పదవీ విరమణ జీవితం ఆనందమయంగా సాగాలని ఆకాంక్షించారు.

కిట్స్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి. నారాయణరెడ్డి, అదనపు కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్‌తో పాటు యాజమాన్య ప్రతినిధులు పదవీ విరమణ పొందిన ముగ్గురిని శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో నిట్ వరంగల్ ప్రొఫెసర్ వి.టి. సోమశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్‌రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి డా. ఎం. నర్సింహారావు, డీన్ ప్రొఫెసర్ ఎస్. నరసింహరెడ్డి, ఎంఅండ్ హెచ్ విభాగాధిపతి డా. కె. శివశంకర్, స్టాఫ్ క్లబ్, కిట్‌స్టా ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొని పదవీ విరమణ పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉద్యోగ విరమణ పొందిన ధనసరి కోటయ్య దంపతులకు సన్మానం.



**బయ్యారం/,జులై 31.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలంలోని ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనసరి కోటయ్య శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు.ఈ సందర్భంగా కోటయ్య దంపతులకు పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమేనని పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు.ఉద్యోగంలో బదిలీలతో పాటు పదవి విరమణ ఉద్యోగ రీతిలో సహజమని పేర్కొన్నారు.విద్యార్థులకు ఎన్నో విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థులకు క్రమశిక్షణకు మార్గదర్శకుడైనటువంటి ఆయన పదవీ విరమణ పొందడం చాలా గర్వకారణమని పలువురు అన్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తన వంతు ఎంతో కృషి చేశారని పాఠశాల అభివృద్ధి తన ధ్యేయంగా పనిచేసే గొప్ప వ్యక్తి కోటయ్య అని కొరియాడారు.ఈ సందర్భంగా కోటయ్య, కోటమ్మ దంపతులకు ఉపాధ్యాయులు ఘనంగా శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



# ఎల్లాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**వంద మందికి పరీక్షలు.. మందులు, పండ్ల పంపిణీ**





**హసన్‌పర్తి/జూలై 31 (జర్నలిస్ట్ వార్త):** ఎల్లాపూర్ గ్రామంలోని మేరీ హెల్ప్ ఆఫ్ క్రిస్టియన్స్ చర్చిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాస్టర్ దాసరి రవికుమార్ ఆధ్వర్యంలో రక్షిత హాస్పిటల్ వైద్య బృందం గ్రామస్తులకు వైద్య సేవలు అందించింది. డాక్టర్ వికాస్ (ఆర్థో), డాక్టర్ ప్రణయ్ (జనరల్ ఫిజీషియన్) సుమారు వంద మంది గ్రామస్తులకు షుగర్, బీపీ, థైరాయిడ్ తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులతో పాటు పండ్లను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాస్టర్ దాసరి రవికుమార్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ లేదా సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.శిబిరంలో రక్షిత హాస్పిటల్ సిబ్బంది రాజు, సందీప్, వంశీ, మమత, చందన, అపర్ణ, సంఘ ఉపదేశి బొర్ర రాజశేఖర్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన కొండేటి శ్రీధర్






**వరంగల్/ జూలై 31 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట నియోజకవర్గంలోని పంతిని గ్రామానికి చెందిన ఆంధ్రజ్యోతి జిల్లా ప్రతినిధి బండి రాంబాబు గౌడ్ కుమార్తెలు తపస్వి గౌడ్, క్రీతిక గౌడ్‌ల నూతన వస్త్ర పుష్పలంకరణ వేడుకలు శుక్రవారం పున్నెల్ క్రాస్ సమీపంలోని సత్యం కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. వారికి ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను అభినందించిన ఆయన, చిన్నారులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాక్షి పత్రిక వర్ధన్నపేట రిపోటర్ రాధాక్రిష్ణ, నియోజకవర్గ సాక్షి టివి రిపోటర్ అజీజ్ , గౌడ సంఘం నాయకులు బండి శ్రీను, బందు మీధుమిత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

# విపత్తుల నిర్వహణపై అధికారులకు అవగాహన.

**-ఆర్డీవో రాజేశ్వరి.**





**బయ్యారం,ప్రభాత వార్త,జులై 31.**
బయ్యారం మండలంలో రాబోయే రోజుల్లో ఊహించని భారీ వర్షాలు, వరదలు, ప్రమాదాలు,విపత్తులు సంభవించినప్పుడు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ముందస్తు ప్రణాళికలతో సిద్దంగా ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్డీవో రాజేశ్వరి అన్నారు.విపత్తుల నిర్వహణపై మండల అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలో విపత్తుల నిర్వహణపై అధికారులకు పలు దిశానిర్దేశాలు చేశారు.విపత్తుల సమయంలో వేగంగా స్పందించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని ఆర్డీవో పేర్కొన్నారు.ఇటీవల వాతావరణ మార్పుల వల్ల ఆకస్మికంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో దీపిక,ఏఈ రఫీ,మెడికల్ ఆఫీసర్ విజయ్ కుమార్,ఏవో కే.రాజు, హెడ్ కానిస్టేబుల్ కాజా తదితరులు పాల్గొన్నారు.

# ఆకేరు ఒడ్డున అసలు కథ ఏమిటి..?

**అరబిందో పాఠశాల ఒక్కటేనా... లేక వాగు గర్భంలో మరెన్ని నిర్మాణాలున్నాయా..?**

**బఫర్ జోన్ ఎక్కడ..? ప్రభుత్వ భూమి ఎంత..? సర్వేతోనే బయటపడే నిజాలు**

**వర్ధన్నపేట/జూలై 31 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణం గుండా ప్రవహించే ఆకేరు వాగు మరోసారి చర్చనీయాంశంగా మారింది. వాగు భూములు, బఫర్ జోన్ ఆక్రమణలపై వస్తున్న ఆరోపణలతో ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి ఈ వ్యవహారంలో ఒక్క అరబిందో పాఠశాలపైనే చర్చ జరగడం కాకుండా, వాగు పరిధిలోని అన్ని నిర్మాణాలపై ఒకే ప్రమాణంతో విచారణ జరగాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.
వర్ధన్నపేట బతుకమ్మ స్థూపం నుంచి ప్రధాన రహదారి వరకు, ఇల్లందవర్ధన్నపేట మధ్య ఆకేరు వాగు వెంట ఎన్ని భవనాలు నిర్మించబడ్డాయి? వాటిలో ఎన్ని ప్రభుత్వ భూముల్లో ఉన్నాయి? ఎన్ని బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయి? ఎవరికి అనుమతులు ఉన్నాయి? అనే ప్రశ్నలకు ఇప్పటికీ అధికారిక సమాధానం లేదు.
ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, ఎఫ్ఎంబీ మ్యాపులు, రెవెన్యూ రికార్డులు, బఫర్ జోన్ పరిమితుల ఆధారంగా వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. సర్వే లేకుండా ఎవరు ఆక్రమణదారులో, ఎవరు కాదో చెప్పడం సాధ్యం కాదని నిపుణులు సూచిస్తున్నారు.ఇదే సమయంలో ప్రజల్లో మరో ప్రశ్న కూడా వినిపిస్తోంది. పేదలు ప్రభుత్వ స్థలంలో చిన్న గుడిసె వేసుకున్నా వెంటనే చర్యలు తీసుకునే అధికారులు, పలుకుబడి ఉన్న వారి నిర్మాణాల విషయంలో కూడా అదే చట్టాన్ని అమలు చేస్తారా? లేక



చట్టం బలహీనులకు ఒకలా, బలవంతులకు మరోలా ఉంటుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాలకు తెరపడాలంటే పారదర్శక సర్వే ఒక్కటే మార్గమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.
ఆకేరు వాగు పరీవాహక ప్రాంతంలో నివాస గృహాలు, వాణిజ్య భవనాలు నిర్మించేందుకు నిబంధనలు ఏమిటి? బఫర్ జోన్ వెడల్పు ఎంత? ఏ పరిస్థితుల్లో అనుమతులు ఇస్తారు? ఏ పరిస్థితుల్లో నిర్మాణాలు నిషేధం? వంటి అంశాలపై సంబంధిత శాఖలు ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.
ఆకేరు నిజంగా ఆక్రమణల బారిన పడిందా..? లేక ఇవన్నీ ఉట్టి ఆరోపణలేనా..?
అరబిందో పాఠశాల ఒక్కటేనా..? లేక వాగు వెంట మరెన్నో నిర్మాణాలున్నాయా..?
ప్రభుత్వ భూమి ఎంత..? ప్రైవేటు భూమి ఎంత..?
ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పేది ఆరోపణలు కాదు.అధికారుల సంయుక్త సర్వే, అధికారిక రికార్డులే.
( ఆకేరు వాగు అసలు సరిహద్దులు, బఫర్ జోన్ నిబంధనలు, ప్రభుత్వ రికార్డులు ఏమి చెబుతున్నాయి?
**పూర్తి వివరాలు తదుపరి సంచికలో)**

# గురుకులంలో భావోద్వేగ వీడ్కోలు

**డాక్టర్ శరత్ బాబుకు ఘన సన్మానం**



**పర్వతగిరి/జూలై 31 (జర్నలిస్ట్ వార్త):** పర్వతగిరి పి.ఎం.శ్రీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంగ్లీష్ లెక్చరర్‌గా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించిన డాక్టర్ టి. శరత్ బాబుకు బదిలీ సందర్భంగా శుక్రవారం ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ఆయన మడికొండ బాలుర జూనియర్ కళాశాలకు బదిలీ కావడంతో కళాశాల ఆవరణలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భద్రాద్రి జోనల్ అధికారి పి. అపర్ణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జోష్న, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శరత్ బాబు కుటుంబ సభ్యులకు విద్యార్థినులు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ డాక్టర్ శరత్ బాబు విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై ఆసక్తి పెంపొందించడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. విద్యార్థులు ఆయన బోధన, మార్గదర్శకత్వాన్ని స్మరించుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తనకు లభించిన ఆదరణను జీవితాంతం గుర్తుంచుకుంటానని డాక్టర్ శరత్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి మందకృష్ణ మాదిగ ఘన నివాళి





**అంతిమయాత్రలో పాల్గొని పూలమాల వేసి శ్రద్ధాంజలి**

**ప్రజల మనిషిని కోల్పోవడం బాధాకరం**

**కుటుంబ సభ్యులను పరామర్శించిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ**

**నర్సంపేట/ జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**
వరంగల్ జిల్లా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఆయన భౌతికదేహానికి, చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.
ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడు. రాజకీయాల్లో ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు.ఆయన సేవలను ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరని. ఆయన మరణం నర్సంపేట ప్రాంతానికే కాదు, ప్రజాజీవితానికి తీరని లోటన్నారు. పెద్ది ఆశయాలు, ప్రజాసేవ స్ఫూర్తిగా నిలిస్తాయని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను అని అన్నారు.మందకృష్ణ మాదిగ వెంట ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు, దళిత రత్న అవార్డు గ్రహీత మంద కుమార్ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు పుట్ట రవన్న మాదిగ, బిర్రు మహేందర్ మాదిగ, కళ్లపల్లి ప్రణయ్ దీప్ మాదిగ, మంద రాజు మాదిగ, కందికట్ల విజయ మాదిగ, బండారి సురేందర్ మాదిగ, తడుగుల



విజయ్ మాదిగ, కట్ల రాజశేఖర్ మాదిగ, గద్దల సుకుమార్ మాదిగ, మంద వర్ధన్ మాదిగ, మాసాని గోపాల్ మాదిగ, ధర్మయ్య మాదిగ, పూర్ణయ్య మాదిగ, దామెర కిషోర్ మాదిగ, బిర్రు భిక్షపతి మాదిగ, బొట్ల ప్రతాప్ మాదిగ, పరికి రత్నం మాదిగతో పాటు పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మాజీ ఎమ్మెల్యేకు అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీకి శాశ్వత కమిషనర్ ఎప్పుడూ?

**ఇన్‌చార్జి పాలనతో పరిపాలనా జాప్యంపై స్థానికుల ఆందోళన**

**పూర్తిస్థాయి అధికారిని నియమించాలని ప్రజల విజ్ఞప్తి**







**వర్ధన్నపేట/ జూలై 31 (జర్నలిస్ట్ వార్త):**వర్ధన్నపేట మున్సిపాలిటీకి శాశ్వత కమిషనర్ నియామకం ఆలస్యం కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మున్సిపల్ పాలకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులను కైవసం చేసుకుంది . ఆ తర్వాత ఇప్పటివరకు ముగ్గురు కమిషనర్లు బదిలీ కాగా, ప్రస్తుతం ఇన్‌చార్జి అధికారితోనే మున్సిపల్ పరిపాలన కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.మున్సిపల్ పరిపాలనలో కమిషనర్ కీలక అధికారిగా వ్యవహరిస్తారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైళ్ల పరిశీలన, పరిపాలనా అనుమతులు, వివిధ ధ్రువీకరణ పత్రాల జారీ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాల్లో ఆయన పాత్ర కీలకం. శాశ్వత కమిషనర్ లేకపోవడంతో కొన్ని పరిపాలనా ప్రక్రియల్లో జాప్యం కనిపిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా మరణ ధ్రువీకరణ పత్రాలు, జనన ధ్రువీకరణ పత్రాలు, ఇతర మున్సిపల్ ధ్రువీకరణ పత్రాలపై అవసరమైన సంతకాల కోసం పలుమార్లు కార్యాలయానికి రావాల్సి వస్తోందని కొందరు దరఖాస్తుదారులు వాపోతున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన కొన్ని ఫైళ్ల ఆమోద ప్రక్రియ కూడా ఆశించిన వేగంతో సాగడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి, ఈ అంశాలపై మున్సిపల్ అధికారుల అధికారిక వివరణ అందాల్సి ఉంది.వేగంగా అభివృద్ధి చెందుతున్న వర్ధన్నపేట మున్సిపాలిటీకి పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమిస్తే పరిపాలనా నిర్ణయాల్లో వేగం పెరగడంతో పాటు ప్రజలకు అందించే సేవలు మరింత సమర్థవంతంగా ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, శాశ్వత కమిషనర్ నియామకం జరిగేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.ప్రజా సేవలను మరింత సమర్థవంతంగా అందించాలంటే మున్సిపాలిటీలో పూర్తి స్థాయి పరిపాలనా వ్యవస్థ అవసరమని, శాశ్వత కమిషనర్ నియామకంతో అభివృద్ధి పనులకు ఊతం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.